క్లుప్తంగా

కొండచిలువ కలకలం



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన షేక్ బాజీ నివాసానికి సమీపంలో 5 అడుగుల పొడవైన కొండచిలువని గుర్తించారు. ఇంట్లోని వారు కేకలు వేయటంతో కొండచిలువ సమీపంలోని ముళ్ల చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది. దీంతో అక్కడనున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం అటవీ శాఖ అధికారులు కేసానుపల్లి చేరుకుని చెట్లపొదల్లో వెతికగా కనిపించకపోవటంతో వారు వెనుతిరిగారు. ఇటీవల కాలంలో గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం సమీపంలో కూడా కొండచిలువ ప్రత్యక్షం కావటంతో బాలికలు భయాందోళన చెందారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామం ముదిరాజ్ బజారులో రూ.16 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించేందుకు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి సోమవారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను గుర్తించి సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ కాళంగి రంగయ్య, కాళంగి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రెంటచింతల: మండలంలోని పాలువాయి గేటు, మంచికల్లు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల, చిలకలూరిపేట కమిటీ సభ్యులు సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మార్గశిర మాసంలో శిరము అనగా తల అని, మార్గం అనగా దారి అని, తలలోనికి దారి అనే విధానం ఉందని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. గురువు నుంచి జ్ఞానాన్ని పొందిన శిష్యుడు కార్తీక మాసంలో దీపపు వెలుగులో అనగా యోగ మార్గంలో ప్రయాణించి.. మార్గశిర మాసంలో తలలోని ఆత్మ వద్దకు చేరుటకు సులభంగా దారి ఏర్పడుతుందన్నారు. మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలన్నారు. దైవ భక్తి, గ్రంథ పఠనం ద్వారా జ్ఞానంతో ఉండాలని ప్రబోధించారు. కార్యక్రమంలో కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, ఎన్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరనాయక్ తదితరులు ఉన్నారు.

పురుగు మందులతో వాతావరణం కలుషితం



అచ్చంపేట: పంటలపై విచ్చలవిడిగా పురుగు మందులు వాడటం వల్ల వాతావరణం కలుషితమవుతుందని ఏరువాక అగ్రి ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధి శిఖా నరసింహారావు సూచించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం అచ్చంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత మాజీ ప్రధాని చరణ్‌సింగ్ దేశంలో మొట్టమొదటిసారిగా కౌలుదారి చట్టం, రాజభరణాలరద్దు లాంటి రైతుల సమస్యలపై పోరాడినందుకుగాను ఆయన జన్మదినోత్సవాన్ని రైతు దినోత్సవంగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలుగకుండా వ్యవసాయ విధానాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి భాస్కరరావు, సాగునీటి సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావును జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. పలు ప్రాంతాలలో మామిడి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, తిరువాయిపాటి ఆంజనేయులు, డైలాండ్ ప్రతినిధి ఎస్.హరిత, ఏరువాక డైరెక్టర్ బి.రవినాయక్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే.. వ్యాపారాలు..!

- నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం
- రోడ్డుపైనే వాహనాలను నిలిపివేస్తున్న వాహనదారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



అంజిరెడ్డి హాస్పిటల్ ఎదురుగా టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డుపైకి ఉన్న వాహనాలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం నిత్యం వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతుంది. వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దానికి తోడు తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు సైతం రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వారి వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చిన వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపి వేస్తుండడంతో ఒక వాహనం వెళ్లేందుకు మాత్రమే మార్గం ఉండే పరిస్థితి నెలకొంది. ఇలా నిత్యం వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అయినా సరే అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు.

ఒక వాహనం వెళ్లేందుకే అవకాశం

ఇప్పుడు మరలా డ్రైనేజీ దాటి మరీ రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. వ్యాపారాలే రోడ్డుపైకి వస్తే వారి వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చిన వారి వాహనాలు నడిరోడ్డుపై ఉంటున్నాయి. దీంతో ఒక వాహనం వెళ్లేందుకు, మరో వాహనం క్రాస్ చేసేందుకు, కాలినడక బాటను నిర్మించారు. వ్యాపారాలు కాలిబాట వరకు వస్తే వారి వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనదారులు క్రాస్ చేసే లైన్ వరకు వెళ్తున్నారు. దీంతో ఒక వాహనం వెళ్లటమే తప్ప మరో వాహనం వెళ్లలేని పరిస్థితి. రోడ్డుపైనే వాహనాలు నిలుపుతూ ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

టిఫిన్ బండి అక్కడే.. వాహనాలూ అక్కడే

టిఫిన్ బండి రోడ్డుపైనే.. టిఫిన్ కోసం వచ్చిన వారి బళ్లు కూడా రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దానికి తోడు అక్కడే రోడ్డు క్రాసింగ్ చేసే డివైడర్ ఉండటంతో ఆగిన బైకుల వద్ద మూల ములుపు తిప్పలేక రోడ్డు క్రాసింగ్ చేసే బైకుల వాళ్లు, రోడ్డుపైనే బైకులు ఆగి ఉండటంతో బస్సు, లారీ లాంటి పెద్ద వాహనాలు వెళితే మరో చిన్న వాహనం వెళ్లలేకపోతుంది. వెళ్లాలని ప్రయత్నించినా ఆగి ఉన్న వాహనాలు ఢీకొనటం జరుగుతుంది. ఇలా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా టిఫిన్ బండి నిర్వాహకులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు వాహనాలు రోడ్డు ఆక్రమించకుండా చూస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ట్రాఫిక్ సమస్యకు చెక్

నిత్యం ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్న పిడుగురాళ్ల పట్టణంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. మెయిన్ రోడ్డును సుమారు 10 అడుగుల నుంచి 14 అడుగుల వరకు వెడల్పు చేయించారు. డ్రైనేజీల నిర్మాణం చేపట్టి చిరు వ్యాపారస్తులను డ్రైనేజీ అవతల వ్యాపారాలు నిర్వహించేలా ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. దీంతో పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా పోయింది.

పార్కింగ్ లేని పెద్ద వ్యాపార సంస్థలు

పిడుగురాళ్ల పట్టణంలో కొత్తగా మూడు భారీ షాపింగ్ మాల్స్(వ్యాపార సముదాయాలు)ను ఏర్పాటు చేశారు. వీరి వద్ద పండుగల సమయంలో షాపింగ్ మరింత పెరుగుతున్న పరిస్థితి. ఈ మాల్స్ వద్ద రద్దీ మరింత పెరుగుతుండడంతో నిత్యం ప్రజల రాకపోకలు కొనసాగుతూనే ఉంటాయి. పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహించే వారు అండర్ గ్రౌండ్‌లో లేదా పార్కింగ్ ప్లేసు ఉండేలా చూసుకోవాలి. దీనికి తోడు వారు పార్కింగ్ ప్లేసులు ఏర్పాటు చేయక పోవడంతో షాపింగ్‌కు వచ్చే వారు వాహనాలను రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేస్తున్నారు. దీంతో ఈ వ్యాపార సముదాయాల వద్ద నిరంతరం ట్రాఫిక్ అంతరాయం, ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



ఎస్‌బీఐ ప్రాంతంలో రోడ్డుపైనే ఉన్న వాహనాలు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదు



వ్యాపారస్తులు ఎవరైనా రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించం. నిరంతరం వ్యాపారం నిర్వహించే పెద్ద వ్యాపారస్తులకు కూడా తెలియజేస్తామని, వారు కూడా పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలిస్తాం. ట్రాఫిక్‌కు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదు.

– శ్రీరాం వెంకట్రావు, సీఐ, పిడుగురాళ్ల

ఏదో ఒక చిన్న ప్రమాదం జరుగుతోంది



వ్యాపారస్తులు రోడ్డుపైనే వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవటం వలన నిత్యం ఏదో ఒక సమయంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అంతే కాకుండా ఒక వాహనం వెళ్తే రోడ్డులో మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.

– ఉర్ల మురళి, పిడుగురాళ్ల



పార్కింగ్ స్థలం లేని షాపింగ్ మాల్

అత్యాశ వలనే సోషల్ మీడియా మోసాలు

ఎస్ఐ శివనాగరాజు



పిడుగురాళ్ల: అత్యాశ వలన సోషల్ మీడియాలో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఎస్ఐ శివనాగరాజు అన్నారు. పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివనాగరాజు మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు వెళ్తున్నారని, ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఏటీఎం నెంబర్ ఎవరు అడిగినా చెప్పవద్దని, అంతేకాకుండా మొబైల్‌కు ఎవరైనా ఓటీపీలు చెప్పమని ఫోన్ చేస్తే చెప్పవద్దని తెలియజేశారు. అలాగే సోషల్ మీడియాలో అనవసరమైన యాప్‌ల జోలికి వెళ్లవద్దని వాటి వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆయన అన్నారు. నేషనల్ సెక్యూరిటీ డేటా బేస్ ఎడ్యుకేషన్ బెంగళూరు కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ విద్యార్థులకు ఎలా మోసపోతారో ప్రాక్టికల్‌గా చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ పి.నరేష్, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.ఫణికిషోర్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మనహరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం

- స్తంభించిన కొనుగోళ్లు
- కల్లాల్లోనే ధాన్యం



వరికోస్తున్న హార్వెస్టర్

కారెంపూడి: గత వారం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు స్తంభించిపోయాయి. దీంతో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే గ్రామాలలో దర్శనమిస్తున్నాయి. ఒక వైపు ముసురుతున్న మబ్బుల భయం.. మరో వైపు కల్లంలో ధాన్యం ఆరబెట్టకపోతే ఇబ్బంది. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కల్లాల్లో మూలుగుతుండడంతో రైతన్నలకు కంటి మీద కునుకు కరువైంది. 12వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్లు బాగానే సాగాయి. ధర కూడా బీపీటీలు 75 కిలోలు రూ.1,450 దాకా పలికాయి. అలాగే సన్నాలు బస్తా గరిష్టంగా రూ.1,900 దాకా కొన్నారు. అయితే ఆ తర్వాత సన్నాలు అడిగే దిక్కే లేకుండా పోయింది. బీపీటీలు రూ.1,200 నుంచి 1,350 దాకా క్వాలిటీని బట్టి అంటున్నారు. కానీ కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. జరిగిన కొద్దిపాటి కొనుగోళ్లు కూడా ప్రైవేటు వ్యాపారస్తులు లేదా ఎరువులు, పురుగుమందుల కొట్ల వాళ్లు ఇచ్చిన అప్పులు వసూలు చేసుకోవాలి కాబట్టి ధాన్యాన్ని వారు కొంటున్నారు. కానీ ధాన్యం వ్యాపారులు మాత్రం ఎందుకో నిర్లిప్తంగా ఉన్నారు. దీంతో అమ్మకాలు కొనుగోళ్లు స్తంభించిపోయి కల్లాల్లోనే ధాన్యం నిల్వలు మూలుగుతున్నాయి. మరో వైపు ఇంకా వరి కోతలు ముమ్మరంగా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. అంతేకాక ఏటేటా వ్యవసాయానికి పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి గానీ అంతే స్థాయిలో దిగుబడి ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకవేళ దిగుబడి ఉన్నా మద్దతు ధర ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కల్లంలో ధాన్యాన్ని ఆరతిప్పుతున్న దృశ్యం


ఐదేళ్ల క్రితం అదే రేటు ..



బస్తా రూ.1,200 ప్రైవేటు వ్యాపారులు అడుగుతున్నారు. అది కూడా ముందుకు రావడం లేదు. వారం రోజులుగా కల్లంలో ధాన్యం పెట్టుకుని వాటిని కాపాడడానికి పాట్లు పడుతున్నాం. ఆరెకరాలలో ధాన్యం అలాగే ఉంది. వాస్తవానికి కడుపు రగిలిపోతోంది. ఐదేళ్ల క్రితం బస్తా రూ.1200 నుంచి రూ.1400 వరకు అమ్మాను. అప్పుడు ఎరువు కట్ట రూ.1,150 ఇప్పుడు అదే కట్ట రూ.1,750. కానీ ధాన్యం ధర మాత్రం అలాగే ఉంది. గతంలో పెట్టుబడులు రూ.25 వేల నుంచి రూ.30 వేలు అయ్యేవి. ఇప్పుడు రూ.40 వేలు అవుతోంది. దిగుబడులు మాత్రం అవే వస్తున్నాయి. అప్పట్లో నాటు కూలి రూ.2,500, ఇప్పుడు రూ.4,500 అయింది. అలాగే దమ్ము గంటకు రూ.600 ఉంటే అది రూ.1,200 అయింది. ఈ లెక్కన రైతు ఇబ్బందులు ఎలా ఉన్నాయో మీరే చూడండి.

– షేక్ ఖాసిమ్, రైతు, కారెంపూడి

పంట వచ్చిన సంతోషమే లేదు



గత 13వ తేదీ వరి నూర్పిడి చేయించా. 2.20 సెంట్లలో వరి వేశా. 60 బస్తాలు అయ్యాయి. బస్తా రూ.1,350 అని సగం బస్తాలు పట్టారు. మిగతావి పట్టకుండా వదిలేశారు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు, అప్పటి నుంచి ధాన్యం ఆరబెట్టడం మబ్బులు చేస్తే పట్ట కప్పుకోవడమే సరిపోతోంది. పెట్టుబడి ఎకరాకు రూ.40 వేలు దాటింది. నా అనుభవంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి కానీ దిగుబడులు, ధరలు మాత్రం పెరగడం లేదు. పంట వచ్చిన సంతోషమే లేకుండా పోయింది.

– బొరిగొర్ల వెంకటేశ్వర్లు, రైతు, కారెంపూడి

క్రీస్తు పుట్టుక సర్వమానవాళికి శుభదినం

పాస్టర్ ప్రసన్నకుమార్

దాచేపల్లి : ప్రభువైన ఏసుక్రీస్తు పుట్టుక సర్వమానవాళికి శుభదినమని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. పాస్టర్ ప్రసన్నకుమార్ సంఘస్తులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక శుభవేళ జరుపుకునే క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని, ఆనందాన్ని నింపాలని, క్రిస్మస్ ద్వారా ప్రతి ఒక్కరు పాపాలను విడిచిపెట్టి పరిశుద్ధంగా జీవించాలన్నారు. అనంతరం సండే స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్ ప్రసన్నకుమార్, ఇరికేపల్లికి చెందిన ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు నాగెండ్ల రత్నం, ఉపాధ్యాయుడు నాగెండ్ల ఏసయ్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డెలిగేట్ వినుకొండ బాబు, చర్చి డెలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ మీసాల బాబు, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, మాజీ సర్పంచ్‌లు వినుకొండ కోటేశ్వరరావు, వినుకొండ సుధీర్‌కుమార్, వినుకొండ మాణిక్యరావు, చెట్టిపాగు అంకయ్య, వినుకొండ పాలేసు, మాజీ ఎంపీటీసీ వినుకొండ పెదజాను, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మాచవరం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కోయ రజనీకుమారి అన్నారు. మండల కేంద్రమైన మాచవరం మహిళా సమాఖ్య కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ క్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని అన్నారు. కేక్ కట్ చేసి డ్వాక్రా మహిళలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీసీలు సీతారామయ్య, నాగరాజు, రవి, మహిళా సమాఖ్య సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

కారెంపూడి: మండలంలో అన్ని చర్చిలు విద్యుద్దీపాలతో కాంతులీనుతున్నాయి. కారెంపూడిలోని లూథరన్ చర్చిని సోమవారం రాత్రి ఆకర్షణీయంగా రంగు రంగుల లైట్లతో అలంకరణ చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో చర్చిలు క్రిస్మస్ శోభతో అలరారుతున్నాయి. క్రిస్మస్ పర్వదిన సందడి అంతటా నెలకొంది. క్రిస్మస్ స్టార్లు వాడవాడలా ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి.



కేసానుపల్లి లూథరన్ చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ ప్రసన్నకుమార్

తోటివారిని ప్రేమించడమే క్రిస్మస్
ప్రాజెక్టు డైరెక్టర్ సిద్దలింగమూర్తి

రెంటచింతల: తోటివారికి ఆపదలో ఉన్నప్పుడు ప్రేమించి సేవచేయడమే నిజమైన క్రిస్మస్ అని ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎం.సిద్దలంగమూర్తి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏటా డిసెంబర్ 25న ఏసు క్రీస్తు జన్మదినాన్ని ప్రపంచంలోని క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వివిధ శాఖాధికారులకు, కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి విజయకుమారి, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఏపీఓ జయచంద్రకుమార్, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, సర్పంచ్ గొ ట్టం ప్రమీల, ఎస్ఆర్పీ జీఎస్ రాజు, అధికారులు, గురవారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

మాచర్ల : ప్రపంచమంతా వేడుకగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని కృష్ణవేణి, ఎస్‌వీఆర్ కళాశాలల కరస్పాండెంట్ వై.వెంకటరామయ్య అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆదిత్య ఒకేషనల్ జూనియర్ కాలేజీలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కృష్ణవేణి, ఎస్‌వీఆర్ కళాశాలల కరస్పాండెంట్ వై.వెంకటరామయ్య పాల్గొన్నారు. రూపే కాలనీ చర్చి పాస్టర్ జాన్‌వెస్లీ ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. పాస్టర్ జాన్ వెస్లీ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు క్రీస్తు పుట్టుక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, కె.నారాయణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఫణికుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించాలన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధి హామీ అధికారి నాగశ్రీనివాస్, లూథరన్ బాబు, కిషోర్, మరియదాసు, చెన్నయ్య, వి.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఎంఈఓ ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యవ్వన జీవితం ఏసుకు సమర్పితం



క్విజ్ పోటీల్లో పాల్గొన్న ఉమ్మడి రాష్ట్ర విద్యార్థులు

మాచర్ల: క్రిస్మస్ అంటే సాధారణంగా చర్చిలను సుందరంగా అలంకరించడం, పెద్ద పెద్ద స్టార్లను ఏర్పాటు చేయటం, క్రిస్మస్ పేరున అనేక వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించడం అందరికీ తెలిసిందే. కానీ మాచర్ల పట్టణానికి చెందిన వీరి శైలి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. యుక్త వయసులోనే అందరిలా జల్సా మార్గం ఎంచుకోకుండా, క్రీస్తుకు వారి జీవితాలను సమర్పించుకున్నారు. ఫలితంగా చర్చి పాస్టర్లుగా మారి అనేక మందిని దేవుని వైపు నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మాచర్ల పట్టణం పదో వార్డుకు చెందిన బ్రహ్మనాయుడు, నెహ్రూనగర్ నివాసి శంకర్ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. వీరు ఉన్నత విద్యను పూర్తి చేసుకొని ఉద్యోగ అవకాశాలు వచ్చినా, వాటిని కాదనుకొని ప్రభువు సేవకు వారి జీవితాలను సమర్పించుకున్నారు. క్రిస్మస్ సమయంలో బైబిల్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేసి యువతలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుటకు ఎంతో ప్రయాస పడుతున్నారు. తొలుత నియోజకవర్గ పరిధిలో ప్రారంభమై నేడు రాష్ట్ర వ్యాప్తంగా యువత ఈ క్విజ్‌లో పాల్గొంటున్నారంటే ప్రభువు ఎంత ఆశీర్వదించాడో మనం అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది ఈ క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రతి ఏడాది ఈ క్విజ్ కోసం బహుమతుల రూపంలో దాదాపు లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వీరి స్నేహితులలో కొందరు సహకారాన్ని అందిస్తున్నారు. ఏసుక్రీస్తు బోధనలు సమాజంలోనికి తీసుకువెళ్లేందుకు వీరు చేసే ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రజనీకుమారి




కారెంపూడిలో కాంతులీనుతున్న లూథరన్ చర్చి



రెంటచింతల మండల పరిషత్ కార్యాలయంలో సెమీ క్రిస్మస్

వ్యాస రచన పోటీల్లో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

బెల్లంకొండ: వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం మాట్లాడుతూ 'వర్చువల్ హియరింగ్, డిజిటల్ యాక్సెస్ టు కన్స్యూమర్ జస్టిస్' అనే అంశంపై వ్యాసరచన పోటీలలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బండారు కల్యాణి ప్రథమ బహుమతి, మొదటి సంవత్సరం విద్యార్థిని షేక్ అఫ్రీన్ తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. వీరికి పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నా రు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.